సంగారెడ్డి

నమస్తే తెలంగాణ | గురువారం 27 మార్చి 2025

THURSDAY, MARCH 27, 2025

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 26 : నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా నాయకుడు చిరంజీవి తల్లి వజ్రమణికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును బుధవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, చిరంజీవికి అందజేశారు. పార్టీలకతీతంగా సేవాదృక్పథంతో ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయారెడ్డి, మండలాధ్యక్షుడు పరమేశ్, నాయకులు చిం టూ నరేశ్ ఉన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

నారాయణఖేడ్, మార్చి 26 : జొన్న రైతులను ఆదుకునే దిశగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం జొన్న పంట కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పొరుగు రాష్ట్రాలకు వెళ్లి రూ.1300లకు క్వింటాళు చొప్పున అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.3,370 ఉండగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. జొన్న రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సూచించారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు

ముంగి శివారులో వృథాగా పోతున్న మిషన్ భగీరథ తాగునీరు

జహీరాబాద్, మార్చి 26 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ఇంటింటికీ తాగునీటి సరఫరా పథకం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతున్నది. పైప్‌లైన్, గేట్ వాల్ లీకేజీలతో మిషన్ భగీరథ నీరంతా వృథాగాపోతున్నది. సంబంధిత శాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. న్యాల్‌కల్ మండలంలోని ముంగి గ్రామ శివారు ప్రాంతంలోని అల్లాదుర్గం-మెటల్‌కుంట ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ గేట్‌వాల్ లీకేజీ అయ్యి నీరు వృథాగా పోతున్నది. ముంగి ఆదిలక్ష్మి ఆలయ సమీపం నుంచి బీదర్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో కూడా పైప్‌లైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతుంది. అసలే ఎండకాలం తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల తాగునీటి ఎద్దడి ఏర్పడింది. వృథాగా పోతున్న నీటిని అరికట్టేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మహనీయుల జయంతి ఉత్సవాలు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 26: జిల్లాలో మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ మాధురి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతి భాపూలే జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరి సహకారం కావాలన్నారు. ప్రతి గ్రామంలో మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సాంఘీక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల భద్రతకు ప్రాధాన్యత

పాశమైలారం ఐడీఏలో ఎస్పీ పారితోష్ పంకజ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పారితోష్ పంకజ్

పటాన్‌చెరు, మార్చి 26 : జిల్లాలోని పరిశ్రమల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఐలా భవనంలో ఇండస్ట్రియల్ ఏరియా అథారిటీ, ఎస్ఎస్ఎస్‌సీ (సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో పరిశ్రమల భద్రత, ట్రాఫిక్ సమస్యల నివారణకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పారిశ్రామికవాడలో నిరంతర నిఘా ఉంటుందన్నారు. పరిశ్రమల వద్ద భద్రతతో పాటు కార్మికులకు రక్షణ కల్పిస్తామన్నారు. మహిళా కార్మికులకు, ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి రోజు వాహనాల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అదనపు ఎస్పీ సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్‌సీ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, రమణారెడ్డి, రాఘవరెడ్డి, జీవీపీ రాజు, సీఐలు స్వామిగౌడ్, వినాయక్‌రెడ్డి, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధూంధాంలో పాల్గొన్న ముక్కెరకు సన్మానం

ముక్కెర సంపత్‌ను సన్మానిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 26: నోట్లపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటో ముద్రించాలని ధూంధాం నిర్వహించిన కవి, రచయిత ముక్కెర సంపత్‌ను బుధవారం సన్మానించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వందమంది కళాకారులతో ధూంధాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముక్కెర ను ఎంపీలు సన్మానించారు.

ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సంగయ్యస్వామి

నారాయణఖేడ్, మార్చి 26: ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నారాయణఖేడ్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన సంగయ్యస్వామి ఎన్నికయ్యారు. సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ, జిల్లా అధ్యక్షుడు అడివయ్య స్వామిలకు సంగయ్యస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తుల సందడి

జహీరాబాద్ పట్టణంలోని బాబా నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం భక్తుల దర్శనాలతో సందడిగా మారింది. మూడు రోజులుగా జరుగుతున్న పెద్దమ్మతల్లి విగ్రహ మహోత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి.

-జహీరాబాద్, మార్చి 26

సక్రమంగా లేని దవాఖానలను సీజ్ చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 26 : రాష్ట్ర వైద్య బృందం పరిశీలనలో రికార్డులు సరిగా లేవని తెలియడంతో ఎంఎన్ఆర్ దవాఖానకు రూ.50 వేల జరిమానా కమిటీ తరపున విధించామని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అథారిటీ అడ్వైజరీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రిజిస్టర్ చేసుకున్న స్కానింగ్ సెంటర్ల వివరాలు, కొత్తగా నమోదు చేసుకున్న, రెన్యువల్ సెంటర్ల వివరాలను డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దవాఖానలోని స్కానింగ్ సెంటర్లను క్రమం తప్పకుండా చూడాలని కోరారు. అవగాహన కార్యక్రమాల ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో ఈ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. పోలీసు శాఖ సాయంతో సక్రమంగా లేని దవాఖానలను సీజ్ చేసి, కేసులు బుక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో ఎట్టి పరిస్థితుల్లో మైనర్లు, ఇతర అబార్షన్లను చేయవద్దని, ఒకవేళ చేస్తే కఠిన చర్యలు విధించాలని స్పష్టం చేశారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్ మాట్లాడుతూ డెకాయ్ ఆపరేషన్ ప్రతి స్కానింగ్ సెంటర్‌లో విధిగా జరపాలని, నారాయణఖేడ్, పటాన్‌చెరు ఏరియా దవాఖానల్లో అబార్షన్లు చేయకుండా చూడాలని కోరారు. సమావేశంలో డీఎస్పీ సంజీవరావు, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి వనజారెడ్డి, పీవో ఎంసీహెచ్ డాక్టర్ నిర్మల, డెమో ప్రసాద్, రవి, శశి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును రద్దు చేయాలి

50వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు

రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న మున్నూరుకాపు సంఘం సభ్యులు

గుమ్మడిదల, మార్చి 26 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)ను రద్దు చేయాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 50వ రోజుకు చేరుకున్నాయి. సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతో గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, మంభాపూర్ గ్రామాల్లో జేఏసీ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 50వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా గుమ్మడిదలలో జేఏసీ నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి డంపింగ్‌యార్డు రద్దు చేయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. గుమ్మడిదలలో మున్నూరుకాపు సంఘం సభ్యులు దీక్ష చేశారు. నల్లవల్లిలో రైతు మహిళా జేఏసీ నాయకులు దీక్షలో పాల్గొనగా మహిళలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని బతుకమ్మ ఆటలు ఆడి నిరసన వ్యక్తం చేశారు. రైతు జేఏసీ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 50 రోజులుగా ఆందోళనలు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా స్పందించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర రైతు సంఘం మాజీ అధ్యక్షుడు మండ బలరాంరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, రైతులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి. పోచుగారి మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అమ్మగారి రవీందర్‌రెడ్డి, మందభాస్కర్‌రెడ్డి, భిక్షపతి, కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, కొరివి సురేశ్, రాంరెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, దోమడుగు బాల్‌రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మంగంపేట ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

జిన్నారం, మార్చి 26 : జిన్నారం మండలం మంగంపేట గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు మండల కమిటీ అధ్యక్షుడు కంది ప్రవీణ్ మాదిగ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పెంటేశ్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా నాగార్జున మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కార్యదర్శిగా నర్సింహులు, ప్రచార కార్యదర్శిగా వంశీ, సలహాదారులుగా వీరేశ్, కార్యవర్గ సభ్యులుగా రంజిత్, ఆంజనేయులు, ఆదర్శ్‌లను ఎన్నుకున్నారు. మాదిగల అభివృద్ధి, సంక్షేమానికి కమిటీ సభ్యులు కృషి చేయాలని ప్రవీణ్ పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్ , అధికార ప్రతినిధి భిక్షపతి మాదిగ పాల్గొన్నారు.

ఇంటి గోడకూలి మహిళ మృతి

మంజుల (ఫైల్)

హత్నూర, మార్చి 26 : ఇంటి గోడకూలి ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన హత్నూర మండలం పన్యాలలో చోటు చేసుకుంది. గ్రామానికిచెందిన కొప్పుల శ్రీను, భార్య మంజుల(49) తోపాటు కొడుకు శ్రీకాంత్, కూతురు కావ్యశ్రీతో కలిసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి గోడకూలి పడుకున్నవారిపై పడటంతో శ్రీను, మంజుల, శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, కూతురు కావ్యశ్రీ వారిని చూసి కేకలువేయడంతో పక్క ఇంట్లోని కుటుంబ సభ్యులు వెళ్లిచూశారు. వెంటనే గాయపడినవారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడి వైద్యులు పరిశీలించి, కొప్పుల మంజుల మృతిచెందినట్లు తెలిపారు. శ్రీను, శ్రీకాంత్‌కు చికిత్స చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

విద్యార్థులకు పోషకాహార సప్లిమెంట్ల పంపిణీ

పోషకాహార సప్లిమెంట్లను అందజేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

కంది, మార్చి 26 : విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని మెరుగుపర్చేందుకు పోషకాహార సప్లిమెంట్లను బుధవారం పంపిణీ చేశారు. ఆర్మ్‌డ్ వెహికల్స్‌నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్) ఓడీఎఫ్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సహకారంతో కంది మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. కందిలో రెండు మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలు, ఓడీఎఫ్‌లో ఒక ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు పోషకాహార సప్లిమెంట్లను పంపిణీ చేశారు. కందిలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఏవీఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కేసీ మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జోగప్ప, ఉపాధ్యాయులు సంధ్యారాణి, విజయలక్ష్మి, శారద, సరిత, నర్సింహులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్త కాశీనాథ్ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలకు చెక్

భూ కేటాయింపు పత్రాన్ని ఏడీ నాగరాజుకి అందజేస్తున్న తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, నేతలు

రామచంద్రాపురం, మార్చి 26 : విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో కరెంట్ సమస్యలు పరిష్కారం కాబోతున్నాయని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్ రెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేశ్ అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని మయూరినగర్‌లో తహసీల్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ భూమికి సంబంధించిన భూ మి కేటాయింపు పంచనామా పత్రాన్ని తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు విద్యుత్ శాఖ ఏడీ నాగరాజుకి అందజేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో రెండు డివిజన్‌ల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారం కాబోతున్నాయని తెలిపారు. ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ రమావతి, ఏఈ రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఎంఐజీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం,మార్చి 26 : భారతీనగర్ డివిజన్‌లోని ఎంఐజీలో పలు అభివృద్ధి పనులకు డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్ రెడ్డితో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ శంకుస్థాపనలు చేశారు. ఎంఐజీలో రూ.98.5లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, వరద నీటికాల్వ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఐజీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఎంఐజీలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి తమ దృష్టికి తీసుకు వస్తున్నారని తెలిపారు. కాలనీలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ భారతీనగర్ డివిజన్‌లో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, ఆదర్శ్ రెడ్డి, సంపత్ గౌడ్, బూన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కోహీర్‌లో దెబ్బ తిన్న పంటల పరిశీలన

దెబ్బ తిన్న మొక్కజొన్న పంట వివరాలను సేకరిస్తున్న ఏవో నవీన్‌కుమార్

కోహీర్, మార్చి 26 : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల ఈదురుగాలులు, వర్షానికి దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి నవీన్ కుమార్ బుధవారం పరిశీలించారు. కోహీర్, మాచిరెడ్డిపల్లి, ఖానాపూర్, తదితర గ్రామాల పొలాలకు వెళ్లి మొక్కజొన్న, జొన్న, మామిడితోటలను సందర్శించి నష్టం వివరాలను రైతుల నుంచి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన పంటల నష్టం అంచనాను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఆయన వెంట ఏఈవో సవిత, రైతులు ఉన్నారు.

వైభవంగా వీరభద్రుడి విమాన రథోత్సవం

బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయంలో విమాన రథోత్సవంలో ఊరేగుతున్న భద్రకాళి సమేత వీరభద్రుడు

గుమ్మడిదల, మార్చి 26 : జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి అమ్మవార్ల విమానరథోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బుధవారం గుమ్మడిదల మున్సిపాలిటీలోని బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయంలో ఆయకమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, ధర్మకర్తల ఆధ్వర్యంలో వీరభద్రస్వామి స్వామివారికి, భద్రకాళీ అమ్మవార్ల మూల విరాట్లకు అభిషేకాలు, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సురభి నాగేందర్‌గౌడ్, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ధర్మకర్తలు పూజారికృష్ణ, భాస్కర్‌గౌడ్, అశోక్, మాజీ సర్పంచ్‌లు, భక్తులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై డబ్బాలు తొలిగిస్తాం..

డబ్బాలను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ రవీందర్

హత్నూర,మార్చి 26 : హత్నూర మండలం దౌల్తాబాద్-కాసాల గ్రామంలో ప్రధానరోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన వాణిజ్య సముదాయాల డబ్బాలను త్వరలో తొలిగిస్తామని ఆర్అండ్‌బీ డీఈ రవీందర్ తెలిపారు. బుధవారం ఆయన దౌల్తాబాద్-కాసాల ప్రధానరోడ్డుపై ఏర్పాటు చేసిన పలు రకాల వాణిజ్య సముదాయాల డబ్బాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన డబ్బాలను యజమానులు తీసివేయాలని లేనిపక్షంలో వాటిని తొలిగించడానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

నేలబారు చదువులు

కిరాయి ఇంట్లో నేలపై విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

నాగల్‌గిద్ద, మార్చి 26 : నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి గ్రామ పరిధిలోని లష్కరి తండా ప్రాథమిక పాఠశాల దుస్థితి చూస్తే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎలాంటి కృషిచేయడం లేదని తెలుస్తుంది. పేద పిల్లలు చదివే పాఠశాలల్లో కనీసం సౌకర్యాలు లేని అద్దె ఇండ్లలో నేల మీద కూర్చో బెట్టి, పాఠాలు బోధిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో 15 మంది విద్యార్థులు, ఒక్క టీచర్ ఉన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు 'మన ఊరు-మనబడి' అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ వేగంగా చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరానికైనా పనులు పూర్తయ్యే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

29న న్యాయ అవగాహన సదస్సు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 26 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర ఆదేశాల మేరకు ఈ నెల 29న న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉగాది తర్వాత సన్న బియ్యం పంపిణీ

మనూరు, మార్చి 26 : లబ్ధిదారులకు ఉగాది తర్వాత సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు మనూరు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం మనూరు ఐకేపీ సమావేశ మందిరంలో డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిందని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ ఖాజామైనొద్దీన్, డీలర్లు బ్రహ్మం, సంజీవ్ కుమార్, అంజయ్య, అశోక్, సిద్ధిరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

జిన్నారం, మార్చి 26 : బొల్లారం మున్సిపాలిటీలో వన్ టైం సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్ను చెల్లించే వారికి పన్ను వడ్డీ బకాయిలపై ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి బుధవారం ప్రకటించారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను వడ్డీ బకాయిలపై 90 శాతం రాయితీ అవకాశాన్ని బొల్లారం పట్టణ ప్రజలందరూ ఈ నెల 31 వరకు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

జహీరాబాద్‌లో వెలుగుతున్న ఐమాస్ట్ విద్యుత్ దీపాలు

జహీరాబాద్, మార్చి 26 : జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిరం కూడలిలోని ఐమాస్ట్ విద్యుత్ దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. సంబంధిత విద్యుత్, మున్సిపాలిటీ అధికారులు పర్యవేక్షణ కరవై వారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగైదు రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ దీపాలు వెలుగుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శా ఖాధికారులు తగు చర్యలు తీసుకొని వాటికి ఆన్ ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేసేలా చూడాలని కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్, మార్చి 26 : జహీరాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సూచనలు, సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రయాణికులు 9959226269కు ఫోన్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

మల్లేపల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

చలివేంద్రం ఏర్పాటు

కొండాపూర్, మార్చి 26 : మండల పరిధిలోని మల్లేపల్లిలో బుధవారం ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆ గ్రామ ప్రత్యేక అధికారి, కొండాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ మర్రి ప్రదీప్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ప్రజలందరూ ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి పాండురంగం, పంచాయతీ కార్యదర్శి కటకం శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం, మార్చి 26 : చలివేంద్రాల ఏర్పాటుతో బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఎంతో దోహదపడుతుందని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని ఎంఐజీలో సింధూ ఆదర్శం మహిళా మండలి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకువచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. బీఆర్ఎస్ మహిళా సర్కిల్ అధ్యక్షురాలు రాణి, శ్రీలత, విజయ, సునీత, గాయత్రి, అరుణజ్యోతి, స్వర్ణ, వాణి, రోజా, కల్యాణి, స్వర్ణలత, సంధ్య, నాయకులు సత్యనారాయణ, దేవేంద్రాచారి, సురేందర్, రాములు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్

నేడు దౌల్తాబాద్ గ్రామపంచాయతీ తైబజార్ వేలం

హత్నూర, మార్చి 26 : హత్నూర మండలం మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్ తైబజార్ వేలంపాటను గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీవో యూసుఫ్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు అడ్వాన్స్‌గా రూ. 50 వేలు చెల్లించాలని తెలిపారు.